అ'న్యాయ' పరీక్షలు!

- ఆర్‌యూ ఎల్‌ఎల్‌బీ పరీక్షల్లో గందరగోళం
- కోడ్ ఒకటే.. ప్రశ్నలు మాత్రం వేరు
- 2వ తేదీన సంబంధం లేని ప్రశ్నపత్రంతో పరీక్ష నిర్వహణ
- విద్యార్థుల గొడవతో ప్రశ్నపత్రం మార్చి ఇచ్చిన అధికారులు
- వర్సిటీ అధికారుల నిర్లక్ష్యం, తప్పిదాలపై విద్యార్థుల ఆగ్రహం
- న్యాయస్థానంలో పిటిషన్ వేసేందుకు సిద్ధమవుతున్న లా విద్యార్థులు



రాయలసీమ యూనివర్సిటీ ముఖ ద్వారం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరీక్షల నిర్వహణలో ప్రతిసారి ఏదో ఒక సమస్య ఉత్పన్నం కావడం పరిపాటిగా మారింది. సమస్యలు వచ్చిన ప్రతిసారి అప్పటికప్పుడు సర్దుబాటు చేసుకోవడం తప్ప.. పొరపాట్లు, తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్న దాఖలాలు మాత్రం కనిపించడం లేదు. మీడియాలో ఎన్ని వార్తలు వచ్చినా విద్యార్థి సంఘాలు ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి మార్పు రాకపోవడం ఏంటని మేధావులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా ఎల్‌ఎల్‌బీ పరీక్షలకు సంబంధించి జరిగిన గందరగోళం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పరీక్షల నిర్వహణలో జరుగుతున్న తప్పిదాలు, ప్రశ్న పత్రాల్లోని తప్పులు, ఒక ప్రశ్న పత్రం బదులు మరో ప్రశ్న పత్రం ఇచ్చి పరీక్షలు రాయించడం లాంటి వాటిని తీవ్రంగా పరిగణించిన లా విద్యార్థుల లోకాయుక్తను ఆశ్రయించడంతో పాటు న్యాయస్థానంలో పిటిషన్ వేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

పరీక్షల నిర్వహణలో లోపాలు

- ఆర్‌యూ పరిధిలో జులై 31 నుంచి ఈ నెల 11వ తేదీ వరకు లా 3, 5 సంవత్సరాల సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించారు.
- జులై 31వ తేదీ జరిగిన 3 సంవత్సరాల ఎల్‌ఎల్‌బీ మొదటి సెమిస్టర్ పరీక్షకు ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీకి సంబంధించిన కొన్ని ప్రశ్నలను ఇచ్చారు.
- 2వ తేదీ జరిగిన పరీక్షలో 'స్పెషల్ కాంట్రాక్ట్స్' అంశానికి సంబంధించి ప్రశ్నలు రావాల్సి ఉండగా 'లా ఆఫ్ కాంట్రాక్ట్స్' నుంచి ప్రశ్నలు వచ్చాయి. ఇది గ్రహించిన విద్యార్థులు పరీక్ష రాయకుండా నిర్వాహకులతో వాగ్వివాదం చేశారు. పరీక్ష రాయకుండా బహిష్కరిస్తామన్నారు. విషయం తెలుసుకున్న ఆర్‌యూ పరీక్షల అధికారి పరీక్ష కేంద్రానికి వచ్చి విద్యార్థులకు సర్దిచెప్పారు.
- మరో ప్రశ్న పత్రం ఇచ్చి పరీక్ష రాయించారు. ఇందులో కూడా తప్పులు ఉండటంతో చేసేదేమీ లేక విద్యార్థులు పరీక్ష రాశారు. రెండో ప్రశ్న పత్రం ఇచ్చినప్పటి నుంచి మూడు గంటల సమయం ఇచ్చి పరీక్ష నిర్వహించారు.
- 4వ తేదీ జరిగిన పరీక్షకు మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ మొదటి సెమిస్టర్ ప్రశ్న పత్రంలో కూడా ఐదు సంవత్సరాల ఎల్‌ఎల్‌బీ కోర్సుకు సంబంధించిన ప్రశ్నలు వచ్చాయని విద్యార్థులు చెబుతున్నారు.
- 6వ తేదీ జరిగిన పరీక్షకు పేపర్ కోడ్ కరెక్టుగా ఉన్నప్పటికీ ఐదు సంవత్సరాల ఎల్‌ఎల్‌బీ హానర్స్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇచ్చారు.
- ప్రశ్నా పత్రాలపై మూడు సంవత్సరాలకు బదులు ఐదు సంవత్సరాలు అని ఉంటుంది.
- పరీక్షలు జరిగిన ప్రతిసారీ ఇలాగే తప్పులు జరుగుతుండటంతో న్యాయ విద్య (లా కోర్సు) చదువుచున్న విద్యార్థులు లోకాయుక్తలో ఫిర్యాదు చేయాలని, న్యాయస్థానంలో పిటిషన్ వేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

విద్యార్థులకు నష్టం జరగనివ్వం

పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రశ్న పత్రాలు షీల్డ్ కవర్‌లో నేరుగా పరీక్ష కేంద్రాలకు వెళతాయి. పరీక్ష సమయానికి అరగంట ముందు మాత్రమే వాటిని ఓపెన్ చేస్తారు. 2వ తేదీ జరిగిన పరీక్షకు సంబంధించి ప్రశ్న పత్రం వేరుగా ఉందని తెలిసిన వెంటనే రెండో సెట్ ప్రశ్న పత్రాలను కేంద్రానికి పంపాం. ప్రశ్న పత్రం ఇచ్చినప్పటి నుంచి మూడు గంటల సమయం ఇచ్చి పరీక్ష రాయించాం. విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్

రాయల జయంతి అధికారికంగా నిర్వహించాలి


శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి పూలమాల వేస్తున్న బలిజ నేతలు

కర్నూలు(అర్బన్): శ్రీకృష్ణ దేవరాయల జయంతి, పట్టాభిషేక మహోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకుంటే ధర్నాలు, నిరాహార దీక్షలు చేపట్టేందుకు వెనుకాడమని బలిజ సంఘం నేతలు స్పష్టం చేశారు. ఈ అంశాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తక్షణమే స్పందించాలన్నారు. గురువారం నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో స్థానిక జీజీ హాస్పిటల్ ఎదురుగా ఉన్న శ్రీ కృష్ణదేవరాయల కాంస్య విగ్రహం వద్ద రాయల 516వ పట్టాభిషేక వార్షిక మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడు పత్తి ఓబులయ్య, శ్రీనివాసమూర్తి, ఆంజనేయులు, చలపతి, పవన్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. దేశ భాషలందు తెలుగు లెస్స అన్న శ్రీ కృష్ణ దేవరాయల పద్యం వినిపించారు. సంఘం ప్రధాన సలహాదారు సింగంశెట్టి సోమశేఖర్,కోశాధికారి శైలేష్, కార్పొరేటర్ స్వామిరెడ్డి, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోషకాహార కిట్ల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): జోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిక్షయ యోజన ప్రోగ్రామ్‌లో భాగంగా గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని జిల్లా క్షయ నివారణ కేంద్రంలో పది మంది టీబీ రోగులకు పోషకాహారం కిట్లను పంపిణీ చేశారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్, డీఎస్‌ఎంఓ డాక్టర్ మల్లికార్జునరెడ్డి, జోష్ ఫౌండేషన్ సభ్యులు టి.సంపత్‌కుమార్, సతీష్, సీటీఎం కో ఆర్డినేటర్ ఉమాపతి, డీపీసీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఒడి బియ్యం


ఒడిబియ్యం కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కర్నూలు(అర్బన్): నగరంలో ఒడి బియ్యానికి నోచుకోని 63 మంది ఆర్యవైశ్య మహిళలకు శ్రావణ మాసం సందర్భంగా గురువారం ఆవోపా సదన్‌లో సామూహిక ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించినట్లు ఆవోపా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు అనిత, కార్యదర్శి సరిత, కోశాధికారి శోభారాణి సహకారంతో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారన్నారు.ఆవోపా కార్యదర్శి మురళీకృష్ణ, కోశాధికారి వెంకటేశ్వర్లు, సభ్యులు హరికిషన్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌కు స్వస్తి పలకండి

కర్నూలు(అగ్రికల్చర్): ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి పలకాలని సి.క్యాంపు రైతుబజారు ఎస్టేటు అధికారి కళ్యాణి వ్యాపారులకు సూచించారు. గురువారం రైతుబజారులో కిరాణ షాపులు, చిన్న షాపుల నిర్వాహకులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించా రు. ప్లాస్టిక్‌ను సమూలంగా నిర్మూలించేందుకు నగరపాలక సంస్థ నిర్ణయించిందని, ఇందుకు వ్యాపారులు సహకరించాలని కోరారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వినియోగించాల్సిన వాటిపై అవగాహన కల్పించారు. రైతు బజారులో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హార్టీకల్చర్ కన్సల్టెంటు శివకుమార్, సెక్యూరిటీ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా సూరిబాబు

కర్నూలు(అర్బన్): ఏపీ ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా సూరిబాబు మాదిగ, ఉపాధ్యక్షుడిగా దేవపుత్ర మాదిగ, ముఖ్య కార్యదర్శిగా ఆంజనేయులు మాదిగను ఎంపిక చేశారు. స్థానిక లలిత కళా సమితిలో ఏపీ ఎంఆర్‌పీఎస్ ఉద్యమ పునర్నిర్మాణంపై ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ హాజరై ఉద్యమ కార్యాచరణపై మాట్లాడారు. ఎంఆర్‌పీఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు ఐక్యత ముఖ్యమన్నారు. ప్రతి పల్లెలో ఏపీ ఎంఆర్‌పీఎస్ జెండాను ఆవిష్కరించాలన్నారు. ఈ నేపథ్యంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. నూతన నాయకత్వానికి ప్రతి ఒక్కరు సహకారం అందించి ఉద్యమాలకు అండగా నిలవాలన్నారు.

విద్యాబోధనలో నైపుణ్యాలు అవసరం


శిక్షణకు హాజరైన కేజీబీవీ పీజీటీలతో డీఈఓ

కర్నూలు సిటీ: కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో పనిచేస్తున్న సీఆర్‌టీ, పీజీటీ, పీఈటీలకు ఇన్‌సర్వీస్ శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 3 నుంచి చేపట్టిన రెండో విడత శిక్షణ గురువారంతో ముగిసింది. కర్నూలు నగర శివారులోని రాఘవేంద్ర బీఈడీ కాలేజీలో శిక్షణ ఏర్పాటు చేశారు. పీజీటీ ఇంగ్లీష్ టీచర్లతో పాటు నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాలకు చెందిన టీచర్లు హాజరయ్యారు. శిక్షణకు హాజరైన టీచర్లకు సరైన సదుపాయాలు కల్పించలేదని, నాణ్యత లేని భోజనం పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరి రోజున జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఎస్.శామ్యూల్ పాల్ పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయులు నిరంతరం నైపుణ్యం పెంచుకోవాలని, ఆంగ్లభాషపై పట్టుసాధిస్తే ఎక్కడైనా రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం సర్టిఫికెట్లను అందజేశారు. సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ సురేష్, కర్నూలు, నంద్యాల జీసీడీఓలు, రిసోర్స్ పర్సన్లు, తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ ఉద్యమంతోనే అమెరికా పెత్తనానికి చెక్

కర్నూలు(సెంట్రల్): 1905 ఆగస్టు 7న బాల గంగాధర్ తిలక్, లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్ స్వదేశీ ఉద్యమానికి శ్రీకారం చుట్టి బ్రిటీష్ ప్రభుత్వం మెడలు వంచారని, అదే స్ఫూర్తితో నేడు స్వదేశీ ఉద్యమం చేపట్టి అమెరికా సుంకాల దురాగతానికి చెక్ పెట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వీఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు చల్లా వాసిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట స్వదేశీ ఉద్యమంపై ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ .. ప్రజలు స్వదేశీ వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.కార్యక్రమంలో వెంకటేష్, సోమన్న, వెంకటరాముడు, ఉమామహేష్ ఆచారి, శిరీష్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలపై అభిప్రాయ సేకరణ


మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): కర్నూలు నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద అదనంగా మరో 60 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ కోరారు. గురువారం స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో కమిషనర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజకీయ పార్టీలు సూచనలు ఇస్తే పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఓటర్ల సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తహసీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

సుంకేసుల బ్యారేజీ గేట్ల పరిశీలన


రోప్‌ను పరిశీలిస్తున్న నిపుణులు

కర్నూలు (సిటీ): తుంగభద్ర నదిపై సుంకేసుల గ్రామం దగ్గర నిర్మించిన కోట్ల విజయభాస్కర్ రెడ్డి బ్యారేజీ (సుంకేసుల) క్రస్టు గేట్ల రోప్‌లు ఇటీవలే తెగిపోయాయి. దీనిపై కేసీ ఇంజనీర్లు జలవనరుల శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గురువారం మెకానికల్ గేట్ల విభాగం ప్రభుత్వ సహాయ సలహాదారు కృష్ణారావు, సీడీఓ విభాగం నుంచి ఇంజినీర్లు వచ్చి సుంకేసుల బ్యారేజీ గేట్లను పరిశీలించారు. బ్యారేజీకి సంబంధించి ఏడు క్రస్టు గేట్ల రోప్‌లు దెబ్బతినడంతో నదికి వరద వచ్చిన సమయంలో గేట్లు పైకెత్తే సమయంలో రోప్‌లు తెగిపోయాయి. వాటిని మార్చాలా, లేకపోతే వాటి స్థానంలో శాశ్వత మరమ్మతుల్లో భాగంగా ఇంకా ఏమైనా చర్యలు తీసుకోవాలా అనే అంశంపై నిపుణుల కమిటీ సభ్యులు గేట్లను, రోప్‌లను, వాటి పనితీరును పరిశీలించారు. బ్యారేజీ నీటిలో రోప్‌లు ఎక్కువ రోజులు ఉండటంతో మన్నిక ఉండటం లేదని, వీటిపై గేట్ల నిపుణులు కన్నయ్య నాయుడుతో చర్చించి నివేదిక అందజేస్తామని ఇంజినీర్లకు సూచించారు. నిపుణుల కమిటీలో సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజినీర్ తరపున ఈఈ విజయసారథి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పి.మల్లేశ్వరి, ప్రదీప్, జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్‌ఈ బాలచంద్రా రెడ్డి, కేసీ కర్నూలు సబ్ డివిజన్ డీఈ ప్రసాద రావు, ఇన్‌చార్జి ఏఈఈ మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డుసైడ్ వ్యాపారులకు రుణాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): రోడ్డు సైడు వ్యాపారులకు షరతులు లేకుండా బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు విజయరామాంజనేయులు, డి.అబ్దుల్‌దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పాతబస్తీలోని హరికిషన్ సుర్జీత్‌సింగ్ భవన్‌లో జి.నరసింహులు అధ్యక్షతన రోడ్ సైడు వ్యాపారుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు సైడు వ్యాపారులకు అనువుగా షాపులు కట్టి తక్కువ అద్దెకు ఇవ్వాలన్నారు. అలాగే ఎలాంటి తనఖాలు లేకుండా బ్యాంకుల నుంచి లోన్ ఇప్పించాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

సమావేశంలో రోడ్డుసైడ్ వ్యాపారుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగర గౌరవాధ్యక్షుడిగా డి.అబ్దుల్‌దేశాయ్, అధ్యక్ష, కార్యదర్శులు ఇక్బాల్‌బాషా, శివప్రసాదు, ఉపాధ్యక్షులుగా కె.విజయరాజు, బాషా, ఆధరాబాషా, ప్రభుదాసును ఎన్నుకున్నారు.

ముత్తైదువులకు పసుపు పారాణి పంపిణీ

కర్నూలు కల్చరల్: శ్రావణ మాసం రెండవ గురువారం పురస్కరించుకుని కర్నూలు ఓల్డ్ సిటీలోని దక్షిణ షిరిడీ సాయిబాబా దేవస్థానంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు.ముత్తైదువులకు పసుపు, కుంకుమ, గాజులు,కాళ్లకు పారాణి, తాంబులాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మంగళ ద్ర వ్యాలను స్వీకరించారు. బాలాజీ సేవా ట్రస్ట్ వారు పా ల్గొన్నారు. ఆలయ పాలక మండలి సభ్యులు మురళి మనోహర్, రామ్మోహన్, దక్షిణ షిరిడీ సాయిబాబా దేవస్థానం కమిటీ ప్రధాన కార్యదర్శి మహాబలేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల్లో జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చ


మాట్లాడుతున్న బి.గిడ్డయ్య

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో ఆగస్టు 9,10,11 తేదీల్లో జరిగే సీపీఐ 24వ జిల్లా మహాసభల్లో కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చిస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పేర్కొన్నారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి 106 చెరువులకు నీళ్లు నింపే పనులను తక్షణమే చేపట్టాలన్నారు. అలాగే పరిశ్రమలను ఏర్పాటు చేసి చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సీఎం చంద్రబాబు జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని, జిల్లా అభివృద్ధికి ఒక్క పైసా కూడా కేటాయించలేదన్నారు.

మూడు రోజుల పాటు సీపీఐ జిల్లా మహాసభలు

సీపీఐ జిల్లా 24వ మహాసభలు మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. మొదటి రోజు 9వ తేదీన జెడ్పీ నుంచి పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందన్నారు. తరువాత 3 గంటలకు పున్నమి టూరిజం హోటల్‌లో ప్రతినిధుల సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయా సభలకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, అభిమానులు హాజరవ్వాలని కోరారు. నాయకులు కె.జగన్నాథం, ఎస్.మునెప్ప, మనోహర్ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల దత్తత పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం ఆయన పీ – 4పై నియోజకవర్గ, మండలాల ప్రత్యేకాధికారులు, మునిసిపల్ కమిషర్లు, ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల్లో దత్తత ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కర్నూలు రూరల్, మంత్రాలయం, కర్నూలు అర్బన్, పాణ్యం, ఓర్వకల్, పత్తికొండ, కృష్ణగిరి, మద్దికెర, ఎమ్మిగనూరు, గోనెగొండ్ల, నందవరం మండలాల్లో ఎక్కువగా దత్తత ప్రక్రియ పెండింగ్‌లో ఉందన్నారు. దీనిపై ఆయా నియోజకవర్గాల అధికారులు దృష్టి సారించాలని సూచించారు. డివిజన్ల వారీగా సాధించిన పురోగతిపై ఆదోని సబ్ కలెక్టర్, పత్తికొండ ఆర్డీఓలతో సమీక్షించారు. బంగారు కుటుంబాల నీడ్ అసెస్‌మెంట్ సర్వేపై కూడా కలెక్టర్ సమీక్షించారు. 74 వేల కుటుంబాల వివరాలపై సర్వే పూర్తయ్యిందని, మిగిలిన 41 వేల కుటుంబాల సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. మండలాల వారీగా 80 శాతం సర్వే పూర్తి చేస్తే ఆదోని అర్బన్, ఆదోని రూరల్, కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, ఆస్పరి, ఆలూరు, కౌతాళం, మండలాల్లో 50 శాతం కంటే తక్కువ సర్వే జరిగిందన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్, జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, సీపీఓ హిమప్రభాకరరాజు పాల్గొన్నారు.

9న టీటీడీ రక్షాబంధన్

కర్నూలు కల్చరల్: ఈ నెల 9న శ్రావణ పౌర్ణమి రోజున తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రక్షా బంధన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్లను నగర శివారులోని గోదా గోకులంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 9న గోదాగోకులం, నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం రేవనూరు గ్రామంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో రక్షా బంధన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అలాగే 16న కృష్ణాష్టమి సందర్భంగా కల్లూరు మండలంలోని శ్రీ రుక్మిణి పాండురంగ స్వామి దేవస్థానం, ఆదోని శ్రీకృష్ణ మందిరంలో గోపూజ కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. గోదాగోకులం అధ్యక్షులు నాగరాజు గుప్త, పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణ అందరి బాధ్యత


అవగాహన సదస్సుకు హాజరైన ఎస్పీ, డీటీసీ

కర్నూలు: ప్రతి పౌరుడు ఒక పోలీసే.. ట్రాఫిక్ నియంత్రణ మనందరి బాధ్యత. రాబోయే రోజుల్లో ప్రజల భాగస్వామ్యంతోనే ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమవుతుందని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో స్కూల్ బస్సులు, ఆటో డ్రైవర్లకు గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీటీసీ శాంతకుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. ఒక రోడ్డు ప్రమాదం జరిగితే ఎన్నో కుటుంబాలు ఇబ్బందులకు గురవుతాయన్నారు. ఆటో డ్రైవర్లు లైసెన్స్‌తో పాటు కచ్చితంగా యూనిఫాం ధరించాలని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రోడ్డు మధ్యలో ఆటోను ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవడం సరైంది కాదన్నారు. అనంతరం ఆటోడ్రైవర్లకు ఖాకీ దుస్తులు అందజేశారు. ఆర్టీఓ భరత్ చవాన్, ఎంవీఐ సుధాకర్ రెడ్డి, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్‌లో అడ్మిషన్లు

కర్నూలు కల్చరల్: కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహిస్తున్న 'స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషియన్ కళాశాల'లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల అడ్మిషన్స్ విభాగం ఇన్‌చార్జ్, అధ్యాపకులు కె.శివరామకృష్ణ, ఏపీటీడీసీ కర్నూలు డీవీఎమ్ జి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం వీఆర్ కాలనీలోని హరితా రెస్టారెంట్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు బీఎస్సీ (హెచ్అండ్ హెచ్ఏ) కోర్సు, పదో తరగతి పాసైన వారు క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ – పెటిసరి కోర్సులు, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ (సర్టిఫికెట్) కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులన్నారు. అడ్మిషన్ పొందిన వారికి దేశ, విదేశాల్లోని ఫైవ్‌స్టార్ హోటల్స్‌లో శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోగా https://sihmtpt.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమాచారం కోసం 97013 43846. 91005 58006, 95021 13163త నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు. సమావేశంలో అకౌంట్స్ మేనేజర్ జాషువా, ఓర్వకల్ మేనేజర్ సువర్ణ కుమారి పాల్గొన్నారు.

వరలక్ష్మి వ్రతానికి ఏర్పాట్లు

కర్నూలు కల్చరల్: శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని జిల్లాలోని అన్ని అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించేందకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వేలాది మంది ముత్తయిదువులు సమీప ఆలయాలకు వెళ్లి అమ్మవారి సమక్షంలో వ్రతాలను ఆచరిస్తారు. వాయినాలు ఇచ్చుకోవడంతో పాటు అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకుంటారు. జిల్లాలో శ్రీశైలం, మహానంది, అహోబిలం, నందవరం చౌడేశ్వరీ దేవి ఆలయం, మంత్రాలయం, ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయాలతో పాటు కర్నూలు నగరం సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలోని చౌడేశ్వరీ దేవి ఆలయం, పాతనగరంలోని చిన్న అమ్మవారి శాల, పెద్దఅమ్మవారి శాల, నిమిషాంబదేవి, కాళికాంబ దేవి, లలితా సుందరేశ్వర, వీఆర్ కాలనీ, కృష్ణానగర్, సంకల్ బాగ్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయాలు, దేవనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయం తదితర ప్రాంతాల్లో వ్రతాలు ఆచరిస్తారు. అలాగే పుణ్య నదీ స్నానాలు చేస్తారు.

నేడు గరుడోత్సవం

మద్దికెర: మండలంలోని రంగనాథస్వామి దేవాలయంలో శ్రావణ శుక్రవారం, పౌర్ణమి సందర్భంగా గరుడోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ వీరయ్య గురువారం తెలిపారు. ఉదయం స్వామివారికి పూజలు, పల్లకీసేవ, సాయంత్రం దేవేరులతో కలిసి గరుడ వాహనంపై ఉంచి పురవీధుల్లో ఊరేగిస్తామని చెప్పారు.

ఎమ్మెల్సీపై దాడి పిరికిపంద చర్య


నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నాయకులు

కల్లూరు: ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి చేయడం పిరికి పంద చర్య అని వైఎస్సార్‌సీపీ పాణ్యం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు భవాని యాదవ్ అన్నారు. ఎమ్మెల్సీ రాచగొల్ల రమేష్ యాదవ్‌పై దాడిని ఖండిస్తూ గురువారం కర్నూలు నగరం పూలే సర్కిల్ (బిర్లాగేట్ సర్కిల్) వద్ద ఉమ్మడి కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో నిరసన చేశారు. భవాని యాదవ్ మాట్లాడుతూ పులివెందులలో జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఎన్నికల్లో ఓడిపోతామని భయంతో టీడీపీ నాయకులు దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ఎక్కాడా లేని విధంగా రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అధికారన్ని అడ్డం పెట్టుకుని వైఎస్సార్‌సీపీలో చురుకుగా ఉన్న నాయకులను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు కేసులు పెడుతూ భయభ్రంతాలకు గురిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచక పాలనను ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు చంద్రిక, రాము యాదవ్, పండు, శ్రీనివాస్ యాదవ్, వాలి, గోపాల్, నాగరాజు, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

చేనేతలపై ప్రభుత్వ నిర్లక్ష్యం


ఆందోళన చేస్తున్న ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): చేనేతల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు నక్కలమిట్ట శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేతల సమస్యల పరిష్కారం కోసం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. చేనేతలు నేసిన వస్త్రాలకు కనీసం గిట్టుబాటు ధరలు లభించడం లేదన్నారు. చేనేతలకు నెలకు రూ.4 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. అలాగే ఆధునిక యంత్రాల కోసం బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించాలని కోరారు. నాయకులు దాశెట్టి శ్రీనివాసులు, కొంకతి లక్ష్మీనారాయణ, రవిశంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను ఆదరించాలి

కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో గురువారం కాలేజీ హోమ్ సైన్స్, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు చేనేత వస్త్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రా ర్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సాంప్రదాయానికి నిదర్శనమైన చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. హోమ్ సైన్స్ విద్యార్థులు హ్యాండ్లూమ్ ఫ్యాషన్ షోకు సంబంధించిన పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు. సాంప్రదాయ చేనేత వస్త్రాలపై జాతీయ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు చేనేత వస్త్రాలతో పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన


ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు

కర్నూలు(హాస్పిటల్): తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పీడియాట్రిక్ విభాగం, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్స్, ఫెడరేషన్ ఆఫ్ ఆబ్‌స్ట్రిక్ట్ అండ్ గైనకాలజిస్టు(ఫాగ్సీ), ప్రసూతి విభాగం, నర్సింగ్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ కర్నూలు మెడికల్ కాలేజీ నుంచి రాజవిహార్ వరకు సాగింది. ఈ సందర్భంగా తల్లిపాల ఆవశ్యకత గురించి చిన్నపిల్లల వైద్యవిభాగాధిపతి డాక్టర్ విజయానందబాబు వివరించారు. కార్యక్రమంలో ఐఏపీ సెక్రటరీ డాక్టర్ వి.వీరరత్నాకర్‌రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ ప్రకాష్ ఆనంద్, ఫాగ్సీ ప్రెసిడెంట్ డాక్టర్ వెంకటరమణ, గైనిక్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ సావిత్రి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మిషన్ కో-ఆర్డినేటర్ బాలామణి

తల్లిపాలు బిడ్డకు అమృతం

కర్నూలు: కర్నూలు అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం జరిగింది. మిషన్ కో–ఆర్డినేటర్ కె.బాలామణి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై తల్లిపాల పోషక విలువల గురించి వివరించారు. అలాగే పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటే కార్యక్రమం, వన్ స్టాప్ సెంటర్ సేవలు, చిన్నపిల్లలకు బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు, ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నష్టాలు జరగకుండా ఆపవచ్చని తెలిపారు. అర్బన్ సీడీపీఓ అనురాధ, మేరీ స్వర్ణలత, పారా మెడికల్ రేష్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.